# ఘటికుడు

"శాస్త్రి వచ్చాడు" అన్నాడు సుబ్బారావు.

"ఏ శాస్త్రిరా" అన్నాను.

"వాడేరా.... ఆ సినీమాలశాస్త్రి. అదే కథల శాస్త్రి" అన్నాడు సిగరెట్టు అవతల పారేస్తూ.

నిజానికి నాకు కదలటానికి కాళ్ళాడలేదు. వాడు అఖండుడు వాడ్ని తప్పించుకోటానికి ఎవరితరమూ కాదు.

శాస్త్రి.... వాడ్ని తల్చుకుంటేనే చాలు. మా చిన్నతనమంతా కళ్ళకు కట్టినట్లు అవుతుంది. ఎంతటి తెలివికలవాడు! చదువుకునే రోజుల్లో ఎంత మంది ఆటలు కట్టించాడు! మేమంతా ఒక గది లోనే వుండేవాళ్ళం. గుంటూరు ఎండ లన్నీ మా పాలే! పెద్దమనుష్యుల దగ్గిర్నుంచీ పుట్టిముంచే రకమువరకూ వాడి స్నేహితులే!

బి. ఏ. చదువుతుండగా వాడెవర్తెనో తీసుకొని పోవటమూ—ఆ తర్వాత సినిమాలో చేరటమూ — అప్పుడప్పుడు తెలుగుపత్రికలలో వాడి పేరు కన్పించటమూ తప్ప—వాడి తాలూకు విశేషములేమీ నాకు తెలియవు.

వాడు వచ్చి నాలుగు రోజులయిందట. వాడికా వూళ్ళో ప్రతివాడూ స్నేహితుడే! ఎవడిదగ్గిర చేబదులు తీసికొన్నా వెళ్ళిపోతోంది. నిజానికి వాడు చేస్తున్న పనికూడా ఇదేనట.

తర్వాత వాడి పని చితికిపోవటమూ—వాడెందుకూ పనికిరాకుండా పోవటమూ సుబ్బారావు నాకు చెప్పాడు.

వాడేదో చెప్తూనే ఉన్నాడు. నాకు ఆలోచన తెగలేదు.

"యింకా నీ దగ్గరకు రాలేద్రా!"

"ఎవరూ"

"వాడేరా"

"ఎందుకు"

"నీ రెండొందలబాకీకూడా చెల్లించవద్దూ."

పంచప్రాణాలు అదిరినయి. రెండొందలు—రెండునెల్ల జీతం—యింట్లో యిల్లాలు పారిస్ శిల్కు కొనమని మూడు నెలలనుంచి వేధిస్తూంటే మనసొప్పదు. పిల్లకు లోలకులు—యిల్లు బాగుచేయించటం—వెన్నపూస ధర మామిడిపండ్ల ధర—యివన్నీ గుర్తొచ్చినయి.

"తప్పదంటావా!" అన్నాను.

"చూస్తావుగ" అన్నాడు సుబ్బారావు ధీమాగ. నిజానికి నేనంటే ప్రతివాడికి కోపం. తప్పించుకుంటానని.

★

సుబ్బారావు సెంట్రల్ స్టేషన్లో కన్పించాడు.

"వచ్చాడా!" అడిగాడు.

"ఆ"

"ఏమయింది"

"ఏముంది అవటానికి. మా తమ్ముడింట్లో వారంనుంచి మకాంవేశాడు. వాడి పని పట్టిస్తున్నాడు.

నేను పిల్పించాను. నా దగ్గిరకు వచ్చాడు. రెండురోజులు మా యింట్లోనే వున్నాడు.

వాడి స్థితికి సానుభూతి చూపాను. ఎల్లాగు తప్పదుగదా అని నేనే యాభైరూపాయలు చేబదులు అని ధ్వనివచ్చేటట్టుగా చెప్పి యిచ్చాను. వాడు ఆ సాయంత్రమే వెళ్ళాడు."

"అది వస్తుందని నమ్మేవేవిఁటి" అన్నాడు.

"రావాలని నేననుకోలేదుగ."

"మళ్ళీ రాదని నమ్మక మేంటి" అన్నాడు. నన్ను కార్నరు చెయ్యాలనే వుద్దేశ్యంతో?

"రాడుగా.........వస్తే ఆ బాకీ యివ్వాలని ఆబ్లిగేషను వుంటుందిగా" అన్నాను నవ్వుతూ.

"అయితే యాభై అన్నా వదిలిందిగా" అన్నాడు.

"రెండొందలుకన్నా చాలా తక్కువకదరా" అన్నాను సగర్వంగా.

"ఘటికుడివిరా నువ్వు. వయస్సు ముదురుతున్నకొద్దీ వూహలు మారటంలేదురా" అన్నాడు.

ట్రాము వచ్చింది.

• ఆముదాలపల్లి వెంకట కోటీశ్వరరావు •